క్లుప్తంగా

పొగాకు కొనుగోలు చేయిస్తాం

బల్లికురవ: నల్లబర్లీ పొగాకు అమ్ముకునేందుకు రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతుల అందరివద్ద కొనుగోళ్లు పూర్తి చేయిస్తామని వ్యవసాయాధికారి పి. శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. మండలంలో 430 మంది రైతులు 1381 ఎకరాల్లో సుమారు 12 వేల క్వింటాళ్ల పంట పండించినట్లు చెప్పారు. ప్రభుత్వం సోమవారం నుంచి మార్టూరులో బుధవారం నుంచి సంతమాగులూరులో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు నిర్దేశిత తేదీల ప్రకారం పండించిన పొగాకును కొనుగోలు కేంద్రాలకు తీసుకెళ్లి అమ్ముకోవచ్చని ఎలాంటి అపోహలు చెందవద్దని వివరించారు. ఈ ఏడాది పొగాకు సాగుకు స్వస్తి పలికి ప్రత్యామ్నాయ పంటలైన మొక్కజొన్న ప్రత్తి, కంది, అపరాల సాగు చేపట్టాలన్నారు.

కార్మికుల న్యాయమైన డిమాండ్లు నెరవేర్చండి

- శనివారం అర్ధరాత్రి నుంచి సమ్మె ప్రారంభించిన మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు
- అత్యవసర సేవల రద్దుతో ప్రజలకు తిప్పలు



సమ్మెలో పాల్గొన్న కార్మికులు

అద్దంకి రూరల్: న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని శనివారం అర్ధరాత్రి నుంచి మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు రాష్ట్రవ్యాప్త సమ్మెకు మద్దత్తుగా నిరవధిక సమ్మె ప్రారంభించారు. దీనిలో భాగంగా ఆదివారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ప్రజారోగ్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కావూరి రఘుచంద్ మాట్లాడుతూ పగలక, రాత్రనక ప్రజలకు అందిస్తున్న సేవలు వెలకట్టలేనివన్నారు. సీఐటీయూ మండల నాయకుడు తంగిరాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జీవో నంబర్ 36 ప్రకారం పనికి తగిన వేతనం చెల్లించాలని కోరారు. గతంలో 17 రోజుల సమ్మె కాలంలో లిఖిత పూర్వకంగా ఇచ్చిన హామీలు నెరవేర్చాలన్నారు. కార్మికులకు కూడా ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు వర్తింపజేయాలన్నారు. అనారోగ్యంలో మృతిచెందిన కార్మికుల వారసులకు ఉద్యోగాల్లో అవకాశం కల్పించాలని కోరారు. ఆల్ ఇండియా లాయర్ అసోషియేషన్ నాయకుడు డి. గంగాధర్, మెడికల్ అండ్ హెల్త్ ఉద్యోగుల యూనియన్ నాయకుడు కేపీ రాజు, మున్సిపల్ వర్కర్ల జిల్లా అధ్యక్షుడు పి. ఆదాం, ఇంజినీర్ విభాగం అధ్యక్ష, కార్యదర్శులు వి.జాన్, శామ్యూల్, కోశాధికారి మారుతి, కమిటీ సభ్యులు మార్కు, జాషువా, వడివేలు తదితరులు పాల్గొన్నారు.

పురస్కారం అందుకున్న బాపూజీ



పురస్కారం అందుకుంటున్న బాపూజీ

అద్దంకి రూరల్: సామాజిక సేవా రంగంలో విశిష్ట సేవలు అందించి నందుకు అద్దంకి చెందిన కొంముది బాపూజీకి పురస్కారం లభించింది. ఆదివారం తెలుగు సంస్కృతి సాహితీ సేవాట్రస్ట్ తెలుగుసాహితీ మహానంది జాతీయ పురస్కారం 2025 వరంగల్‌లో అందచేశారు. బాపూజీని పలు సేవాసంస్థల ప్రతినిధులు అభినందించారు.

వైఎస్సార్ సీపీ నాయకుడి మృతికి సంతాపం

మార్టూరు: మండలంలోని ద్రోణాదుల గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు మృతి చెందగా పార్టీ బాధిత కుటుంబానికి రూ. 10 వేలు ఆర్థిక సాయం అందించి సంతాపం తెలియజేశారు. స్థానిక ఎస్సీ కాలనీకి చెందిన పల్లెపోగు శామ్యూల్ (62) గుండె పోటుకు గురై శనివారం రాత్రి స్వగృహంలో మృతి చెందాడు. పర్చూరు నియోజక వర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ గాదె మధుసూదనరెడ్డి ఆదేశాలతో మార్టూరు మండల కన్వీనర్ జంపని వీరయ్య చౌదరి ఆదివారం స్థానిక నాయకులతో కలిసి శామ్యూల్ కుటుంబానికి సంతాపం తెలిపారు. ఖర్చుల నిమిత్తం ఆ కుటుంబానికి రూ. 10 వేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో ద్రోణాదుల సర్పంచ్ వంకాయలపాటి భాగ్యారావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న జంపని వీరయ్య చౌదరి, సర్పంచ్ భాగ్యారావు తదితరులు

పప్పులకు మంగళం

- చక్కెర, బియ్యం పంపిణీకే పరిమితమైన చౌక ధర దుకాణాలు
- నాలుగు నెలలుగా నిలిచిపోయిన కందిపప్పు సరఫరా
- అధిక ధరలు చెల్లించి కొనుగోలు చేయలేక అల్లాడుతున్న పేదలు
- నియోజకవర్గంలో 88,502 కార్డులు, 219 రేషన్ దుకాణాలు



కందిపప్పు పంపిణీ చేస్తున్న డీలర్ (ఫైల్)

అద్దంకి: పేదల ఆశలతో కూటమి ప్రభుత్వం ఆటలాడుకుంటోంది. నెలకు నాలుగైదు రోజులైనా పేదలు పప్పన్నం తినాలనే ఉద్దేశంతో పౌరసరఫరా శాఖ ద్వారా తక్కువ ధరకే కందిపప్పును పంపిణీ చేయడం ఆనవాయితీగా వస్తోంది. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పాటైన అనతి కాలంలోనే కందిపప్పును కార్డు దారులకు సరఫరా చేయడం మానేసింది. దీంతో అత్యధిక ధరకు కందిప్పును కార్డుదారులు బహిరంగ మార్కెట్‌లో కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. పేదలకు కూడు గూడు గుడ్డ అందించడం రాజ్యాంగంలోని ఆర్టికల్స్ ప్రకారం ఆదేశాలున్నాయి. ఈ క్రమంలో గతంలో బియ్యం, కందిపప్పు, చక్కెర, గోధుమలు, కిరోసిన్ పంపిణీ చేసేవారు. అయితే ప్రస్తుతం గ్యాస్ వంటకాలు కావడంతో కిరోసిన్ పంపిణీ ఎప్పటి నుంచో నిలిచిపోయింది.

రూ.57కే కందిపప్పు..

గతంలో కందిపప్పు ధర రూ.100 లోపే ఉన్నా, అప్పటి ప్రభుత్వ పౌర సరఫరాల ద్వారా రూ.67కే కందిపప్పును కార్డుదారులకు అందించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నిత్యావసర వస్తువుల ధరలు అమాంతం పెరిగాయి. దానికి తోడు కందిప్పు బహిరంగ మార్కెట్‌లో రూ.175 వరకు వెళ్లి, ప్రస్తుతం రూ.120 నడుస్తోంది. ఈ ధర చెల్లించి పేదలు పప్పులు కొనుగోలు చేసి తినడం కష్టంగా మారింది.

బియ్యం, చక్కెరకే పరిమితం

గత ప్రభుత్వ హయాంలో కొనసాగిన ఎండీయూ వాహనాలను తొలగించి వారి పొట్ట కొట్టడమే కాకుండా, పాత పద్ధతిలో చౌక ధరల దుకాణాలను తెరిచారు. అయితే ఈ దుకాణాల్లో కేవలం బియ్యం, చక్కెరను విక్రయించడాకే పరిమితం అయ్యాయి. వండితే ముద్దయ్యే బియ్యం, దుకాణాల నుంచి ఇళ్లకు చేరకుండానే దుకాణాల్లో నుంచి రాష్ట్రాలు దాటి పోతోంది. నేతల జేబులు నింపడానికే ఉపయోగపడుతోంది. ఇక చక్కెర ఒక్కటే మిగిలింది. దీంతో కార్డుదారులు ఇవేమి చౌకధరల దుకాణాలు అని ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మరలా కందిపప్పును కార్డుదారులకు అందించాలని ప్రజలు కోరుతున్నారు.

నియోజకవర్గంలో కార్డులు, దుకాణాల వివరాలు

మండలం	కార్డుల సంఖ్య	దుకాణాలు
అద్దంకి	25,773	58
బల్లికురవ	17,466	41
కొరిశపాడు	14,637	43
జె. పంగులూరు	14,896	34
సంతమాగులూరు	18,730	43

పేదలు ఏం చేయాలి

కందిపప్పు చౌకధరల దుకాణం ద్వారా మరలా పంపిణీ చేయాలి. బహిరంగ మార్కెట్‌లో ప్రస్తుతం ఉన్న ధరకూ కొనుగోలు చేసి తినే స్థోమత పేదలకు లేదు. కిలో కందిపప్పు పంపిణీ చేసినా వారికి పండగే.

– జి. రామయ్య, తిమ్మాయపాలెం

కందిపప్పు సరఫరా లేదు

గత కొన్ని నెలల నుంచి కందిపప్పు పై నుంచే సరఫరా లేదు. ప్రస్తుతం చక్కెర, బియ్యం కార్డు దారులకు సకాలంలో అందిస్తున్నాం. పై నుంచి కందిపప్పు వస్తే దుకాణాకు అందిస్తాం.

– రామకృష్ణ, గోడౌన్ డీటీ

దేవస్థానానికి రైలింగ్, గ్రానైట్ వితరణ



ప్రత్యేక అలంకరణలో అమ్మవారి మూల విరాట్



దాతలను సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

వేటపాలెం: రామన్నపేట శివారులో పంట పొలాల్లో వేంచేసియున్న కనక నాగవరపమ్మ అమ్మవారి దేవస్థానానికి రూ. 1 లక్ష విలువగల బ్లాక్ గ్రానైట్, స్టీల్ రైలింగ్ సర్కిల్‌ను వితరణగా అందజేసినట్లు ఆలయ ఈఓ పోతిన శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం దాతలు ఆదివారం అమ్మవారికి పొంగళ్లు పొంగించుకొని మొక్కులు తీర్చుకొన్నారు. కోరిన కోర్కెలు తీర్చే తల్లికి ఆలయ అభివృద్ధికి తమవంతు సహకారం అందజేసినట్లు దాతలు తెలిపారు. ఈఓ మాట్లాడుతూ దేశాయిపేటకు చెందిన గోలి మహేంద్ర కుమార్, సుధారాణి దంపతుల ఆలయానికి రూ. 1 లక్ష విలువగల స్టీల్ రైలింగ్, గ్రానైట్ అందజేశారని తెలిపారు. దాతలను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అచ్చెం శెట్టి భాను, బడ్ల బాబు, కూర్మ రాహుల్జీ, యారాసు అరుణ్‌బాబు, గుత్తి ప్రసాద్, భూసం శ్రీను, చింతా రాము పాల్గొన్నారు.

పేదలకు ఉచిత న్యాయ సహాయం



మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి

అద్దంకి: రాష్ట్రంలోని పేద ముస్లింలతో పాటు అన్ని కులాలకు సంబంభంధించిన పేద వారందరికీ ఉచిత న్యాయ సహాయం అందిచాలని ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి మీరు సా బాబు అన్నారు. పట్టణంలోని సంఘ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ లీగల్ సెల్ ఇన్‌చార్జి షేక్ అబ్దుల్ జబ్బార్ మాట్లాడారు. తన మీద నమ్మకంతో రాష్ట్రస్థాయి బాధ్యత అప్పగించిన సెల్ అధ్యక్షుడు, రఫీ రాష్ట్ర కార్యదర్శి బాబుకు, ధన్యవాదాలు తెలియజేశారు. రాష్ట్ర స్థాయిలో కూడా, ఒక్క ముస్లింలే కాకుండా, అన్ని వర్గాల పేదవారికి న్యాయపరమైన సహాయ, సహకారాలు అందిస్తామని.. ప్రతి జిల్లా స్థాయిలో లీగల్ సెల్, ఇన్చార్జిలను నియమిస్తున్నామని చెప్పారు. షేక్ అహ్మద్, షేక్ అఫ్రిది, కరిముల్లా, హుస్సేన్ హజ్రత్, షేక్ రసూల్, షేక్ ఆజాద్ షేక్ రఫీ, షేక్ అక్బర్ పాల్గొన్నారు

భక్తి శ్రద్ధలతో ఏకాదశ రుద్ర పారాయణ



సముద్రతీరాన రుద్రోపాసన కార్యక్రమంలో సత్యసాయి భక్తులు

వేటపాలెం: రామాపురం సముద్రతీరం వద్ద సత్యసాయిబాబా శత జయంతి వేడుకల్లో భాగంగా రాష్ట్ర సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో ఏకాదశ రుద్ర పారణ (రుద్రోపాసన) భక్తి శ్రద్ధలతో ఆదివారం నిర్వహించారు. సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఆర్. లక్ష్మణరావు మాట్లాడుతూ సముద్రతీరాన విశ్వ మాన వాళి శాంతి కోసం కరుణాసముద్రుడైన సత్యసాయి బాబాని ప్రార్థిస్తూ రుద్రోపాసన నిర్వహించామన్నారు. కార్యక్రమంలో చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య పాల్గొని మాట్లాడుతూ సత్యసాయి సేవా సంస్థల విశిష్టతలు, సాయిబాబు చేసిన సేవలు గురించి తెలియజేశారు. సత్యసాయి బాబా వందవ జన్మదినాన్ని ప్రభుత్వం రాష్ట్ర పండుగగా ప్రకటించడం సంతోషదాయకమన్నారు. సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేంద్ర, జిల్లా అధ్యక్షుడు రాంబాబు, రాష్ట్ర కోఆర్డినేటర్లు జిల్లా సమితి అధ్యక్షుడు పాల్గొన్నారు.

మమ్మేలు తల్లీ గంగమ్మా!



భక్తులకు ప్రత్యేక దర్శనంలో గంగమ్మ తల్లి



కారంచేడు: మొక్కుబడులు తీర్చుకొనేందుకు బారులు తీరిన భక్తులు

కారంచేడు: ఆపదలను తీర్చే కల్పవల్లిగా విరాజిల్లుతున్న గంగమ్మ తల్లికి భక్తులు తమ మొక్కుబడులు తీర్చుకున్నారు. అమ్మవారికి ఎంతో ప్రీతికరమైన ఆదివారం ఉదయం నుంచి భక్తులు పెద్ద ఎత్తున ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారికి ఇష్టమైన పొంగళ్ళను నైవేద్యంగా సమర్పించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులకు అన్నసంతర్పణ నిర్వహించారు.

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త

చీరాల టౌన్: గ్రామంలో సీజనల్ వ్యాధులకు గురి కాకుండా ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేస్తున్నామని, ప్రజలంతా వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని దేవాంగపురి గ్రామ పంచాయతీ సెక్రటరీ శ్రీను సూచించారు. ఆదివారం గుమ్మస్త్రాలకాలనీ, కృపానగర్, హస్తినాపురం, తదితర ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను నిర్వహించారు. సెక్రటరీ మాట్లాడుతూ గ్రామంలో నివాసం ఉంటున్న ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. తడిచెత్త, పొడిచెత్తను వేర్వేరుగా నిల్వ చేసి చెత్త బుట్టలను అందించాలన్నారు.

కార్యదర్శుల సమావేశం నేడు

చీరాల టౌన్: మండలంలోని అన్ని గ్రామపంచాయతీల కార్యదర్శులు, సచివాలయాల అడ్మిన్లతో సోమవారం సమావేశాన్ని నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ శివన్నారాయణ తెలిపారు. వివరాలతో విధిగా హాజరుకావాలని సూచించారు. అలాగే తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించనున్న రెవెన్యూ ఉద్యోగుల సమావేశానికి విధిగా రెవెన్యూ సిబ్బంది, అధికారులు హాజరుకావాలని తహసీల్దార్ కుర్రా గోపీకృష్ణ కోరారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేస్తున్న స్పందన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

వైఎస్సార్ సీపీ నూతన గ్రామ కమిటీ ఎంపిక



గ్రామ అధ్యక్షుడిని అభినందిస్తున్న మండల కన్వీనర్ శ్రీనివాసరావు

జె.పంగులూరు: మండల పరిధిలోని పంగులూరులో వైఎస్సార్ పార్టీ కార్యాలయంలో ఆదివారం నూతన వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ ఎంపిక జరిగింది. పార్టీ మండల కన్వీనర్ రావూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో, గ్రామ కార్యకర్తల సమక్షంలో ఎంపిక నిర్వహించారు. గ్రామ అధ్యక్షునిగా ముప్పనేని శ్రీనును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ కమిటీ సభ్యులుగా ఆరుగురిని, వారికి అనుబంధ కమిటీ సభ్యులుగా 15 మందిని ఎన్నుకున్నట్లు కన్వీనర్ శ్రీనివాసరావు తెలిపారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో పార్టీ బలోపేతానిక కమిటీలు వేస్తున్నాట్లు తెలిపారు. జంపాని రాజా, చిలుకూరి సాంబశివరావు, తిరపతయ్య, హనుమంతురావు, పి. రాంబాబు తదితరులున్నారు.

కూటమి వైఫల్యాలు ఎండగట్టడమే ధ్యేయం



అంబడిపూడిలో మాట్లాడుతున్న కృష్ణబాబు

బల్లికురవ: గ్రామ, బూత్ కమిటీల ఎంపికతో కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్ళటమే వైఎస్సార్ సీపీ ధ్యేయమని ఆ పార్టీ మండల కన్వీనర్ దేవినేని కృష్ణబాబు వెల్లడించారు. ఆదివారం రాత్రి మండలంలోని పెదఅంబడిపూడి గ్రామంలో గ్రామ, బూత్ కమిటీల ఎంపిక చేపట్టారు. ఆయన మాట్లాడుతూ కూటమి 15 నెలల పాలనలో మేనిఫెస్టోలో ప్రకటించిన హామీలను నెలవేర్చకుండా ప్రశ్నించేవారిపై అక్రమ కేసులు బనాయిస్తోందన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనలను అడ్డుకోవటమే అజెండాగా ఎంచుకున్నారన్నారు. ఆయన వెంట పలువురు నాయకులున్నారు.

భక్తిశ్రద్ధలతో పోలేరమ్మ కొలుపులు

- వీరతాళ్లతో నృత్యాలు చేసిన యువకులు



గ్రామోత్సవంలో పోలేరమ్మ తల్లి చిత్రపటం

కారంచేడు: గ్రామ దేవత, అన్నదాతల ఇలవేల్పు పోలేరమ్మ తల్లి కొలుపులను ఆదివారం కన్నుల పండువగా నిర్వహించారు. గ్రామస్తులంతా సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో, పాడి పంటలతో ఉండాలని ప్రజలు ఈ కొలుపులు చేయడం ఆనవాయితీ. ప్రతి ఏడాది సాగుకు ముందు గ్రామంలో ప్రాంతాల వారీగా ఈ కొలుపులు చేసి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కుబడులు చేసుకుంటారు. దీనిలో భాగంగా ఆదివారం గ్రామంలోని మాస్కో బజారుకు చెందిన అన్నదాతలు, యువకులు, చిన్నారులు, మహిళలు పెద్ద ఎత్తున పోలేరమ్మకు పూజలు చేశారు. ఉదయం గ్రామంలోని రెండు చెరువుల మధ్య కొలువైన అమ్మవారికి తలంటు స్నానాలు చేయించారు. మధ్యాహ్నం మేళతాళలతో అమ్మవారికి నైవేద్యాలను అర్పించారు. రాత్రికి అమ్మవారి చిత్రపటంతో ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్‌పై ఊరేగింపు నిర్వహించారు. ఊరేగింపులో యువకులతో పాటు చిన్నారులు వీరతాళ్ళతో నృత్యాలు చేశారు. విచిత్ర వేషధారణలు ఆకట్టుకున్నాయి. ఇంటింట అమ్మవారికి పసుపు, కుంకుమలను సమర్పించారు. భక్తులకు ఏవిధమైన అసౌకర్యాలు కలుగకుండా కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. విద్యుత్ ప్రభ చూపరులను విశేషంగా ఆకట్టుకుంది.

పోలేరమ్మ అమ్మవారికి పొంగళ్లు

ఇంకొల్లు(చినగంజాం): మండలంలోని గొల్లపాలెం గ్రామంలో పోలేరమ్మ అమ్మవారికి పొంగళ్ళు కార్యక్రమాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని భక్తులంతా ఊరేగింపుగా పోలేరమ్మ ఆలయం వద్దకు వెళ్ళి పూజలు నిర్వహించి అమ్మవారికి పొంగళ్ళు నైవేద్యంగా సమర్పించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



అలంకరణలో గొల్లపాలెం పోలేరమ్మ అమ్మవారు



పొంగళ్ళు ఊరేగింపుగా తీసుకొని వెలుతున్న భక్తులు

వైష్ణవీ దుర్గామాతకు బోనాలు



ప్రత్యేక అలంకరణలో వైష్ణవీదుర్గామాత



అమ్మవారి బోనాలతో ఆలయానికి వస్తున్న భక్తులు

కారంచేడు: మండల కేంద్రమైన కారంచేడు రెండు చెరువుల మధ్య కొలువైన శ్రీవైష్ణవీ దుర్గామాత ఆలయంలో ఆషాఢ మాస ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం వేకువజాము నుంచే భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారి ఆలయానికి బోనాలతో దారులు పట్టారు. ఆలయ ధర్మకర్తల ఇంటి నుంచి మొదటగా అమ్మవారి అలంకరణకు అసరమైన ఆభరణాలను ఊరేగింపుగా తీసుకువచ్చారు. అనంతరం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. వివిధ రకాల పూలతో అలంకరించిన అమ్మవారి దర్శనం కోసం పెద్ద ఎత్తున హాజరయ్యారు. మధ్యాహ్నం నుంచి బోనాలతో అమ్మవారి దర్శనంకు వచ్చి ప్రత్యేక పూజలు, ఆవుపాలతో అభిషేకాలు నిర్వహించారు.

వృద్ధ శరణాలయానికి సరుకులు అందజేత



నిత్యావసరాలు అందజేసిన క్లబ్ కమిటీ సభ్యులు

వేటపాలెం: దేశాయిపేట పంచాయతీ నీలకంఠాపురంలో గల అనాథ వృద్ధ శరణాలయానికి రోటరీ క్లబ్ ఆఫ్ చీరాల ఆధ్వర్యంలో నిత్యావసరాలను క్లబ్ సభ్యులు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా క్లబ్ ప్రెసిడెంట్ జాలాది కృష్ణమూర్తి మాట్లాడుతూ రోటరీ సేవా కార్యక్రమంలో భాగంగా ఆశ్రమానికి రెండు బస్తాల బియ్యం, సరుకులు, కూరగాయలు, బిస్కెట్ ప్యాకెట్లు, పండ్లు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ ట్రెజరర్ పోలుదాసు రామకృష్ణ, బి. హేమంత్‌కుమార్, తిరుమలశెట్టి లక్ష్మిప్రతాప్, గుర్రం రాఘవరావు, డీవీ సురేష్, డాక్టర్ బాబూరావు, ఎం. శ్రీనివాసరావు, వీరాంజనేయులు, ఆశ్రమ శాశ్వత కన్వీనర్ సత్రం మల్లేశ్వరరావు, గుత్తి విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

రోటరీ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

అద్దంకి: రోటరీ గవర్నర్ ఆఫ్ శింగరకొండ నూతన కార్యవర్గం ఆదివారం ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమం పట్టణంలోని వాసవీ కళ్యాణ మండపంలో నిర్వహించారు. రోటరీ గవర్నర్ రాంప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యవర్గం అధ్యక్షునిగా బాచిన శివధర పూర్ణ చంద్రరావు, కార్యదర్శిగా అళహరి హరిప్రసాద్, కోశాధికారిగా చామర్తి వెంకట గురుశేఖర్ ప్రమాణీ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా రొటేరియన్ కాకర్ల వెంకటేశ్వర్లు ఆర్థిక సౌజన్యంతో నాగన్నపాలెం గ్రామ షిరడీ సాయి రిజిస్టర్డ్ సహకార సంస్థకు 25000 రూపాయల విలువైన కుట్టు మిషన్ అందించారు. తాజా మాజీ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య అధ్యక్షత వహించిన సభలో సహాయ గవర్నర్ రావి అంకమ్మ చౌదరి, డిస్ట్రిక్ట్ సెక్రటరీ కొల్లా సింగారావు, మాజీ సెక్రటరీ చుండూరి మురళీ సుధాకరరావు, మాజీ ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు, వీరవల్లి సుబ్బారావు (రుద్రయ్య), షేక్ మహమ్మద్ రఫీ,పంచాగ్నుల ఉదయభాస్కర్ చదలవాడ ఫణింద్రబాబు, సందిరెడ్డి శ్రీనివాసరావు, రోటరీ సభ్యులు పాల్గొన్నారు.



ప్రమాణ స్వీకారం చేసిన నూతన కార్యవర్గం